చెరువులకైనా నీళ్లు మళ్లించండి!


తావడపల్లి వద్ద ప్రవహిస్తున్న కౌండిన్య


నదికి ఆనుకుని ఎండిన సముద్రపల్లి చెరువు

- కౌండిన్య నుంచి సముద్రం పాలవుతున్న నీళ్లు
- నది నుంచి చెరువులకు నీటిని మళ్లించే అవకాశం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఎమ్మెల్యే అయినా చొరవ చూపాలంటున్న రైతులు

పలమనేరు: ఎబ్బుడోగానీ ఇలాంటి వానలు రావు, కౌండిన్య నది పొంగిపోతాంది, నీళ్లంతా తమిళనాడులోని మోర్ధన ప్రాజెక్టుకు వెళ్లి అక్కడి నుంచి సముద్రం పాలవుతుంటే కడుపుమండతాంది సామీ, ఈడేమో చెరువుల్లో నీరు లేదు, ఇట్లా వృథాగా పోయే నీటినైనా ఇక్కడి చెరువుల్లోకి మళ్లిస్తే మాలాంటి రైతులకు మేలుకాదా అంటూ కౌండిన్య నది గట్టుపై ఓ రైతు ఆవేదన భరితమైన మాటలివి. ఆరైతేకాదు మండలంలోని అందరి రైతులు గోడు కూడా ఇదే. ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడు జరగని పరిస్థితి. దీనిపై పాలకులు, పాలితులు అసలు పట్టించుకోవడంలేదు. పోతేపోనీలే నీళ్లేకదా అనే నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంలా మారుతుందేమో.

వంద టీఎంసీల నీరు వృథా

గత కొన్నాళ్లుగా కౌండిన్య నది ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు, సోమల ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో నది భారీగా ప్రవహిస్తోంది. ఇప్పటికే మండలంలోని కాలువపల్లి వైఎస్సార్ జలాశయం మొరవపోతోంది. వంద టీఎంసీల నీరు తమిళనాడులోని మోర్ధన ప్రాజెక్టుకు చేరుతోంది. అక్కడ వారు భారీ ప్రాజెక్టును కట్టి ఇక్కడి నీటిని వడిచిపట్టుకుంటున్నారు. ఈ ప్రాంతంలో కౌండిన్యలో కట్టిన చెక్‌డ్యామ్‌లు సైతం దెబ్బతిని కొట్టుకుపోయాయి. కనీసం వీటిని నిర్మించి ఉన్నా కొంతవరకైనా నీటిని నిల్వచేసుకునే అవకాశం ఉండేది. ఈ పనులు అంచనాల దశలోనే కొట్టుమిట్టాడుతున్నాయి.

ఇలాచేస్తే పది చెరువులను నింపుకోవచ్చు

మండలంలోని కౌండిన్య నది ప్రవహిస్తున్న దానికి ఆనుకొని ఉన్న చెరువులు మాత్రం నీళ్లలేక ఎండిపోయిన దృశ్యాలు ఇక్కడ కనిపిస్తున్నాయి. కౌండిన్య నది నుంచి నీటి వాటమున్న చోట కొంత మేర జేసీబీతో కాలువచేస్తే జల్లిపేట చెరువు నుంచి ముడివారిపల్లి, ఈర్లచెరువు, కూర్మాయి, తావడపల్లి, సముద్రపల్లి చెరువులను కౌండిన్య నీటితో నింపుకోవచ్చు. నదిలో వృథాగా వెళ్లే జలాలను ఇక్కడి చెరువుల్లో నిల్వచేసుకొనే అవకాశం ఉంది. దీని గురించి ఇరిగేషన్ అధికారులు అసలు పట్టించుకోవడంలేదు. రైతులేమో వృథాగా పోతున్న నీటిని చూసి బాధపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే అనుకుంటే జరగదా?

స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథ రెడ్డి అనుకుంటే వృథా నీటిని వాలున్న చెరువుల్లోకి నింపడం పెద్ద కష్టమేమీ కాదని నీళ్లలేని చెరువులున్న గ్రామాలు రైతులు చెబుతున్నారు. ఆయనకున్న అనుభవంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి చెరువులకు మళ్లించాలని కోరుతున్నారు. పోనీ ఆయన మాటిస్తే రైతులే ఆయా చెరువులకు చందాలేసుకొని తాత్కాలిక కాలువల ద్వారా చెరువులు నింపుకుంటాము దేవరా అని బతిమలాడుతున్నారు. ఆలస్యం అమృతం విషమన్నట్టు వెంటనే గనుక వృథా జలాలను వడిసి పట్టుకోకపోతే కౌండిన్యలో వెళుతున్న జలాలు సముద్రంపాలు కావాల్సిందే.

క్లుప్తంగా

వెంకన్న ఆదాయం రూ.4.72 లక్షలు


హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పుంగనూరు: పట్టణ సమీపంలోని కోనేటి వద్ద గల కల్యాణ వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.72లక్షలు వచ్చినట్లు ఆలయ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. మూడు నెలలకొకసారి పరకామణిలో భాగంగా గురువారం హుండీలోని కానుకలను లెక్కించారు. శ్రీవారికి రూ.4.72 లక్షల ఆదాయం లభించిందని టీటీడీ ఖాతాలో జమ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. లెక్కింపులో విజిలెన్స్ గార్డ్ కృష్ణారెడ్డి, సిబ్బంది చెంగప్ప, శ్రీకాంత్, నరేంద్ర, కల్యాణ్, శ్రీధర్, చింటు, సాయి, కృష్ణ, సేవకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఆయుధ పూజలు


వాహనాలకు పూజలు చేస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, కార్మికులు

పుంగనూరు: మున్సిపల్ కార్మికులు దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం మున్సిపాలిటీ వాహనాలకు ఆయుధ పూజలు నిర్వహించారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు కలసి వాహనాలకు, భవనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. డీఈఈ మహేష్, మేనేజర్ రెడ్డీశ్వరి, ఏఈ రుఫేష్, టీపీఎస్ జగదీశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు నాగరాజు, నరేంద్రరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప పాల్గొన్నారు.

కార్మికుల సేవలు ఎనలేనివి


సిబ్బందికి వస్త్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

వి.కోట: మన పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పరిపరక్షణకు నిరంతరం కృషి చేసే పంచాయతీ కార్మికుల రుణం మనం ఎప్పటికీ తీర్చుకోలేమని సర్పంచ్ పీఎస్ లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీ కార్మికులకు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందించి స్వీట్లు పంచిపెట్టారు. ముందుగా పంచాయతీలోని ట్రాక్టర్లకు, పనిముట్లకు, వివిధ వాహనాలకు పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, వార్డు మెంబర్లు కుమార్‌రాజా, ముంజుల, వేణు ఆచారి, మోహన్ రాజు, పంచాయతీ సెక్రటరీ నరేష్, సిబ్బంది సాధిక్, జహీర్, కష్ణ, రమణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): పౌష్టికాహారంతోనే ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని మిట్టమీదరాచపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సిబ్బందితో కలిసి పౌష్టకాహార మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎర్రమ్మ, కళావతి, రజని పాల్గొన్నారు.

బాణసంచా కేంద్రం పరిశీలన


బాణసంచా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా కేంద్రాన్ని గురువారం సాయంత్రం పలమనేరు ఆర్డీఓ భవాని, తహసీల్దార్ రాముతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల ఏర్పాటు, వాటి వివరాలు, లైసెన్సుదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ కేవీ రమణ, ఆర్ఐ ఫణికుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ కిరణ్‌కుమార్

రొంపిచెర్ల: రొంపిచెర్ల తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అమర్‌నాథ్‌ను చిత్తూరు కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న కిరణ్‌కుమార్‌కు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కొనసాగాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశాలు జారీ చేశారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


అంగన్‌వాడీ కేంద్రంలో మాసోత్సవాలు

రొంపిచెర్ల: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ సుస్మిత అన్నారు. గురువారం కుమ్మరపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువలతో కూడిన ఆహారం దొరుకుతుందన్నారు. దీనిని తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని అన్నారు. ముంగరవారిపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రెడ్డి మంజుల, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మీదేవి, మీనా పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు మెరుగు పరచాలి


హాస్టల్‌లో మెప్మా డైరెక్టర్ రవీంద్ర

గంగవరం: హాస్టల్లో శానిటేషన్ పనులు మెరుగ్గా చేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ రవీంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. పలమనేరు పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లను గురువారం ఆయన తనిఖీ చేశారు. హాస్టళ్లలో శానిటేషన్ సమస్యలను గుర్తించిన ఆయన శానిటేషన్ మెరుగుపరిచి శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.
అనంతరం ఎద్దుల సంత వీధిలోని నీటి సరఫరా పంప్ హౌస్‌ను పరిశీలించి తరచూ క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. అనంతరం మెప్మా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెప్మా పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీతో అక్రమాలకు చెక్


ఈకేవైసీ చేస్తున్న ఉపాధి సిబ్బంది

సదుం: గ్రామాల్లో వలసలను నివారించి, స్థానికంగా కూలీలకు పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఈ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. వీటిని నివారించేందుకు ఎన్ని యాప్‌లు తీసుకొస్తున్నా నిధులు పక్కదారి పడుతూనే ఉన్నాయి. అధికారంలోని పార్టీ నాయకుల సూచనలతోనే పనులు జరుగుతాయన్నది బహిరంగ రహస్యం. ఈనేపథ్యంలో అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త విధానంతో నకిలీ కూలీలకు అడ్డుకట్ట వేయొచ్చని భావిస్తోంది. గతంలో జాబ్‌కార్డు ఉన్న వారు కాకుండా మరొకరు పనులకు వెళ్లేవారు. ఒకరి బదులు మరొకరు పనులకు వచ్చినా ఫొటోలు అప్‌లోడ్ చేసేవారు. ప్రభుత్వం ఎంఎన్ఎస్ఎస్ యాప్ తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గత నెల 25 నుంచి ఈకేవైసీ పద్ధతిని తీసుకొచ్చారు. పనులకు హాజరైన కూలీలతో మొదట ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. మళ్లీ నాలుగు గంటల తరువాత ఫొటో తీస్తారు. ఎవరి ఫొటో ఉంటే వారికే నగదు ఖాతాల్లో జమ అవుతుంది. దీంతో గ్రామాల్లో ఈకేవైసీ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది.

తప్పనిసరిగా చేయించుకోవాలి



ఉపాధి కూలీలందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. అన్ని గ్రామ పంచాయతీలలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందుకోసం సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలి. ఈకేవైసీ నమోదైన వారికి మాత్రమే ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

శ్రీనివాసులు, ఏపీఓ, సదుం

మిరప పంటల పరిశీలన


మిరప పంటను పరిశీలిస్తున్న రామక్రిష్ణరావ్

బైరెడ్డిపల్లె: మండలంలో గురువారం జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో–ఆర్డినేటర్ రామక్రిష్ణరావ్ మిరప పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మిరప పంటలో రసం పీల్చు పురుగులు, తామర పురుగులు ఆశించి నష్టం కలుగచేస్తున్నాయన్నారు. వాటి నివారణకు వేపనూనె నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఎకరాలో 10 నుంచి 20 వరకు పసుపు, నీలి రంగు జిగురు అట్టలను పొలంలో పెట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖాధికారిణి గీతాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ పనుల తనిఖీ


మోడల్ స్కూల్ పనులను పరిశీలిస్తున్న డీఈ కిషోర్

రొంపిచెర్ల: స్థానిక మోడల్ స్కూల్ నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషోర్ గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి తరగతి గదుల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 10 తరగతి గదులను సిద్ధం చేస్తామని చెప్పారు. భవన నిర్మాణాలకు నిధులు కొరత లేదన్నారు. పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ రెడ్డి ప్రదీప్, ఏఈ వేణుగోపాల్, కాంట్రాక్టర్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

నేడు చారాలలో కబడ్డీ పోటీలు

- **చౌడేపల్లె:** మండలంలోని చారాల ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో భాగంగా పలమనేరు డివిజనల్ స్థాయిలో బాలబాలికలకు అండర్–14, 17 కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం రేణుక, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర తెలిపారు. ఈ పోటీలకు డివిజనల్ స్థాయిలోని అన్ని కేటగిరిలకుగానూ 44 జట్లు పాల్గొంటాయన్నారు. అండర్–17 బాలురు, బాలికలు 55 కేజీలలోపు బరువు ఉండాలన్నారు. అలాగే అండర్–14 బాలురు 51 కేజీలు, బాలికలు 48 కేజీల లోపు బరువు ఉండాలని తెలిపారు.

జాతీయ బాలికల దినోత్సవం

- **చౌడేపల్లె:** స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సులోచన, రాధ తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, తల్లితండ్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

26న కార్తీక వనభోజనాలు

పుంగనూరు: పట్టణంలోని హరిహర బ్రాహ్మణ యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు ఫణిభాస్కర్, రాజేష్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహించే రీతిలో కార్తీక మాస పూజలు నిర్వహించి, 26న గూడూరుపల్లెలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, వన భోజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సురేంద్రబాబు, మహేష్ కుమార్, పార్థసారథి, వినోద్ పాల్గొన్నారు.

సేంద్రియ పంటలే ఆరోగ్యం


ఆహార దినోత్సవంలో ఐసీడీఎస్ సిబ్బంది

గంగవరం: సేంద్రియ పంటలతో పండించే బియ్యం, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు అధికంగా పోషక విలువలు కలిగి ఉంటాయని వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారని యోగా గురునందగోపాల్ తెలిపారు. పలమనేరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుజారితే అంతే!

మండలంలోని నూనెముద్దనపల్లెకు వెళ్లే మార్గంలోని కొత్తయిండ్లు వద్ద రోడ్డుపై వెళ్లే సమయంలో పట్టుజారితే అంతే.. పడడం ఖాయం. అంకాలమ్మ కొండ నుంచి రామయ్యగట్లు మీదుగా ఎర్రగోలవంక నుంచి వర్షపు నీరు కాటం చెరువుకు చేరుతుంది. రోడ్డుపై కల్వర్టు లేక పోవడంతో నీరంతా రోడ్డుపై ప్రవహించి పాచి కట్టింది. రోడ్డుపై వెళ్తున్న ద్విచక్రవాహనదారులు, పాదచారులు జారిపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- చౌడేపల్లె


కొత్తయిండ్ల వద్ద పాచికట్టి ప్రమాదకరంగా మారిన రోడ్డు

షెడ్డులోనే కుయ్యో.. మొర్రో!

- రెండు నెలలుగా 108 షెడ్డుకే పరిమితం
- అత్యవసర పరిస్థితుల్లో వేరే మండలం నుంచి రాక
- ప్రాణాపాయస్థితి ఉన్న వారి పరిస్థితి దేవుడెరుక
- కలెక్టర్‌సారూ చొరవతీసుకోండి


మరమ్మతుకు గురైన 108

చౌడేపల్లె: ఆపద సమయంలో అత్యవసర పరిస్థితుల్లో రాత్రి, పగలు తేడా లేకుండా ఏసమయంలోనైనా 108 నంబర్‌కు ఫోన్‌చేస్తే చాలు తక్షణమే నిమిషాల వ్యవధిలో కుయ్..కుయ్ మంటూ ఘటనా స్థలానికి చేరుకొనే చౌడేపల్లె 108 షెడ్డుకు పరిమితమైంది. మరమ్మతులకు గురై అంబులెన్స్‌ను షెడ్డుకు తరలించారు. 60 రోజులైనా అంబులెన్స్ మరమ్మతులకు నోచుకోకపోగా, చౌడేపల్లెకు 108 వాహనం లేక అత్యవసర పరిస్థితిల్లో క్షతగాత్రులు, రోగులు ఇబ్బంది పడాల్సివస్తోంది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటుచేసిన ఈ పథకాన్ని గత ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 108 సేవలను నిర్వీర్యం చేస్తూ ప్రజలకు ఈ తరహా సేవలను అందించడంలో పూర్తిగా విఫలమయ్యారు. మండల పరిధిలో బోయకొండ, రాజనాలబండ, మృత్యుంజయేశ్వరస్వామి ఆలయాలున్నాయి. ఆలయ సందర్శనతోపాటు తిరుపతి, తిరుమల, కాణిపాకం ఆలయాలకు వెళ్లే వాహనాదారులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇటీవల కాలంలో పలు ప్రమాదాలు జరిగినా చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రులకు తీసుకురావడానికి 108కు ఫోన్ చేస్తే ఎప్పుడో గంట రెండు గంటల సేపు తరువాత పుంగనూరు, లేదా పెద్దపంజాణి, పలమనేరు ప్రాంతాల నుంచి రావాల్సిన స్థితి నెలకొంది. మండల ప్రజలకు సౌకర్యంగా ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ ఆగస్టు 16 నుంచి మరమ్మతులకు గురికావడంతో ప్రస్తుతం షెడ్డుకే పరిమితమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అంబులెన్స్ లేక అత్యవసర పరిస్థితుల్లో రోగులకు, గాయపడిన వారిని ప్రయివేటు వాహనాల్లో తీసుకెళ్లాల్సి వస్తోంది. ఇక ప్రాణాపాయ స్థితిలో గ్రామీణ పల్లెల్లో ఉన్న వారి సంగతి చెప్పలేం. కలెక్టర్ స్పందించి త్వరితగతిన అంబులెన్స్ చౌడేపల్లెకు కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాలువలు కాదు వీధులే!



యనమసామనపల్లెలో వర్షపునీరు ఇంట్లోకి రాకుండా అడ్డుకునేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు, కాలువలను తలపిస్తున్న వీధులు

మండలంలోని కాగతి పంచాయతీ యనమసామనపల్లెలో వీధులు వర్షం నీరు ప్రవహించే కాలువలను తలపిస్తోంది. గురువారం కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ జలమయమై చెరువును తలపించింది. వీధుల్లోని వర్షపునీరు బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటుచేయకపోవడంతో నీరంతా ఇళ్లలోకి చేరుతోంది. వర్షంలోనే బతుకుదేవుడా అంటూ ఇళ్ల వద్ద మట్టితో నీరు లోపలికి రాకుండా కట్టలు వేసుకొనేందుకు ప్రజలు నిమగ్నమయ్యారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
- చౌడేపల్లె